సాక్షి
జనగామ
గురువారం | 18 | సెప్టెంబర్ | 2025



చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్

సాయుధ చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ,ఆర్ఎస్ఎస్‌ను నిలదీయాలని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ అన్నారు. -8లో▸



దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం

సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. -8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $33^0/23^0$

జిల్లాలో ఉదయం పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం, సాయంత్రం వాతావరణం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా పింకేశ్ కుమార్

జనగామ: జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌ను నియమిస్తూ సీఎస్ రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కువైట్ పర్యటనలో భాగంగా ఈనెల 17 నుంచి 27వ తేదీ వరకు సెలవుపై వెళ్లిన కారణంగా ఏసీ పింకేశ్ కుమార్ కు అదనపు బాధ్యతలను అప్పగించినట్లు కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ ఆకర్షణీయ ఆఫర్లు

జనగామ: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ నెల రూ.299కి ఇంటర్నెట్, టీవీచానల్స్, ఉచిత కాల్స్ అందించే ఆకర్షణీయమైన ప్లాన్ విడుదల చేసినట్లు జనగామ సబ్ డివిజనల్ ఇంజనీర్ చంద్రగిరి ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిజిటల్ భారత్ లో భాగంగా నెలకు రూ.299లకు 460 టీవీ తెలుగు, తదితర టీవీచానెళ్లు, 20 ఎంబీపీఎస్ ఇంటర్నెట్, ఉచిత అన్ మిటెడ్ కాల్స్ సేవలను సైతం పొందవచ్చన్నారు. వీటితో పాటు 9 ప్రముఖ ఓటీటీలతో కలుపుకుని రూ.399 ప్యాకేజీతో అందిస్తున్నామన్నా రు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో ఓఎల్‌టీలను ఏర్పాటు చేశామని, గ్రామీణ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ ఫ్రాంచైజీల కోసం లోకల్ కేబుల్ ఆపరేటర్లు తమను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. అతి తక్కువ ధరలకు బీఎస్ఎన్ఎల్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు 94901 24838 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

వైద్య విద్యార్థుల స్టైఫండ్ విడుదల చేయాలి

- టీ–జుడా బాధ్యుల డిమాండ్

ఎంజీఎం : రాష్ట్రంలోని వైద్య విద్యార్థుల పెండింగ్ స్టైఫండ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ జూనియర్ డాక్టర్ అసోసియేషన్ (టీ–జుడా) బాధ్యులు ప్రభుత్వాన్ని బుధవారం డిమాండ్ చేశారు. మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ (డీఎంఈ) పరిధిలోని సంస్థల అధిపతులు స్టైఫండ్ బిల్లులను సమయానికి సమర్పించినా, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఆమోదానికి నిలిచిపోతున్నాయని తెలిపారు. స్టైఫండ్ విడుదల కాకపోవడంతో జూనియర్ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్లు, సూపర్ స్పెషాలిటీ విద్యార్థులు, డెంటల్ పోస్ట్ గ్రాడ్యుయేట్లు, హౌస్ సర్జన్లు, నర్సింగ్ విద్యార్థులు ఆర్థికంగా సతమతమవుతున్నారని పేర్కొన్నారు. సకాలంలో స్టైఫండ్ విడుదల చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి వినతులు అందించామని చెప్పారు. వెంటనే పెండింగ్ స్టైఫండ్, అప్పులకు సంబంధించి మొత్తాన్ని విడుదల చేయాలని కోరారు.


విద్యార్థులు ఉద్యమించాలి

హన్మకొండ: సాయుధ పోరాట స్ఫూర్తితో విద్యారంగం అభివృద్ధి, విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు ఉద్యమించాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) జాతీయ సలహాదారుడు అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని హోటల్ హరిత కాకతీయలో యూఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా మహాసభ జరిగింది. ముందుగా హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు నుంచి హోటల్ వరకు విద్యార్థులు ర్యాలీ తీశారు. ఏఐకేఎఫ్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు జెండావిష్కరణ చేశారు. భగత్‌సింగ్ చిత్రపటానికి అరుణ్‌కుమార్, నాయకులు పూ లమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం యూఎస్ఎఫ్ఐ అలుపెరుగని పోరాటాలను చేస్తోందని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మనోజ్, కార్యదర్శి మాలోత్ రాజేశ్ నాయక్, నాయకులు బాలగోని రాకేష్, జయకృష్ణ, హరీశ్, కృష్ణమూర్తి, అభిరామ్, సురేశ్, ధనుశ్, మహేశ్ పాల్గొన్నారు.

సమ్మక్క సాగర్‌కు 5,93,830 క్యూసెక్కుల నీరు

కన్నాయిగూడెం: గోదావరికి ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో మండల పరిధిలోని తుపాకులగూడెం గ్రామ పరిధిలో సమ్మక్క సాగర్ బ్యారేజీకి భారీగా వరద వచ్చి చేరుతోంది. బ్యారేజీలోకి ఎగువ నుంచి 5,93,830 క్యూసెక్కుల నీరు వచ్చి చేరడంతో అధికారులు 59 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.

రామప్ప ఆలయం అద్భుతం



వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయం అద్భుతంగా ఉందని జర్మనీ దేశానికి చెందిన క్రిష్టియన్ స్లావిక్ కొనియాడారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయాన్ని ఆయన బుధవారం సందర్శించి రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. పూజారులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్ కుమార్ వివరించగా రామప్ప శిల్పకళ సంపద బాగుందని కొనియాడారు.



జాతీయ జెండాను ఎగురవేసి, సెల్యూట్ చేస్తున్న విప్ అయిలయ్య

వేడుకలకు హాజరైన నాయకులు, ప్రజలు, అధికారులు



పోరాటయోధుల త్యాగఫలం!

వారి బలిదానంతోనే స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నాం..

- బీఆర్ఎస్ పదేళ్ల సంక్షోభం తర్వాత రాష్ట్రంలో ప్రజాపాలన
- ఆడపడుచులను కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్ లక్ష్యం
- ప్రజాపాలన వేడుకల్లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య
- కలెక్టరేట్ ప్రాంగణంలో ఘనంగా వేడుకలు

జనగామ: ఎందరో పోరాట యోధుల బలిదానంతోనే మనమంతా స్వేచ్ఛావాయువులను పీల్చుకుంటున్నామని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. జనగామ కలెక్టరేట్ ప్రాంగణంలో బుధవారం జరిగిన ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్ విప్ అయిలయ్యకు ఘన స్వాగతం పలికారు. ముందుగా బీర్ల అయిలయ్య అమర వీరుల స్థూపానికి నివాళులర్పించి, జాతీయ జెండా ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల విధ్వంసం తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పాలనతో స్వేచ్ఛగా బతుకుతున్నామన్నారు. నిజాం పాలన నుంచి విముక్తి పొంది 78వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నామన్నారు. సంక్షేమంతో పాటు తెలంగాణ మహిళల ఆత్మగౌరవాన్ని రెట్టింపు చేస్తూ కోటీశ్వరులను చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కంకణబద్ధులై పనిచేస్తున్నారన్నారు.

విద్యలో ఆదర్శం..

జాతీయ స్థాయిలో జరిగిన న్యాస్‌లో మొదటి 50 జిల్లాల జాబితాలో జనగామ జిల్లాకు ఉత్తమ చోటు దక్కగా, రెండు తెలుగు రాష్ట్రాల్లో నెంబర్‌వన్‌గా నిలిచి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం పుర స్కరించుకుని హైదరాబాద్ శిల్పకళా వేదికలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులను అందుకోవడం జిల్లాకే గర్వకారణమన్నారు. అలాగే విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రత్యేక చొరవ తీసుకుని దిక్సూచి అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సుహాసిని, జెడ్పీ సీఈవో మాధురీ షా, ఆర్డీవో గోపీరామ్, తహసీల్దార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విప్ బీర్ల అయిలయ్య

సంక్షేమం ఇలా..

రాష్ట్రంలో మహిళలు, ట్రాన్స్ జెండర్లకు ఆర్టీసీలో ఉచిత రవాణా సౌకర్యాన్ని అందించే మహాలక్ష్మి పథకంతో జిల్లాలో ఇప్పటివరకు రూ.2కోట్ల47లక్షల విలువైన ప్రయాణఖర్చు ఆదా కాగా, దీనిని ప్రభుత్వమే భరించిందని ప్రభుత్వ విప్ తెలిపారు. నిరుపేదలకు సొంత ఇంటికలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 55, 998ఇళ్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. న్యాస్‌లో జనగామ జిల్లా జాతీయ స్థాయిలో ఉత్తమంగా నిలువడం అభినందనీయమన్నారు. గృహజ్యోతి స్కీం ద్వారా జిల్లాలో 14లక్షల59వేల 470 జీరో బిల్లులు జారీ చేయగా, 92వేల774 కుటుంబాలు రూ.42 కోట్ల జీరో బిల్లులు ఇవ్వడం జరిగిందని స్పష్టం చేశారు.



వేదికపై విప్, ఇన్‌చార్జ్ కలెక్టర్, రెవెన్యూ అదనపు కలెక్టర్, డీసీపీ, ఏఎస్పీ, ఉన్నతాధికారులు

యూరియా కోసం రాస్తారోకో

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో ఘన్‌పూర్–పాలకుర్తి రోడ్డుపై యూరియా బస్తాల కోసం రైతులు బుధవారం రాస్తారోకో చేశారు. శివునిపల్లి ఆగ్రోస్ సెంటర్ వద్దకు యూరియా స్టాక్ వస్తుందనే సమాచారంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు పెద్దసంఖ్యలో చేరుకుని క్యూలో నిల్చున్నారు. మధ్యాహ్నం వరకు స్టాక్ రాకపోవడంతో రైతులు తీవ్ర నిరాశ చెందారు. కాగా మధ్యాహ్న సమయంలో ఆగ్రోస్ సెంటర్‌కు రావాల్సిన 266 బస్తాల లోడ్ గోదాంకు వెళ్తుండగా గుర్తించిన రైతులు వెంటనే యూరియా బస్తాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మండుటెండలో క్యూలో నిల్చున్నా ఒక్క యూరియా బస్తా దొరకడం లేదని, రైతుల సమస్యలు అధికారులు, పాలకులకు పట్టడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రైతుల రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంభించింది. కాగా విషయం తెలుసుకున్న ఏఓ చంద్రన్‌కుమార్ శివునిపల్లి ఆగ్రోస్ సెంటర్‌కు చేరుకుని రాస్తారోకో చేస్తున్న రైతులకు నచ్చజెప్పారు. అనంతరం పోలీసు బందోబస్తు మధ్యలో రైతులకు యూరియా పంపిణీ చేశారు.



శివునిపల్లిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

రేపు జాబ్ మేళా

జనగామ రూరల్: ఈనెల 19వ తేదీన నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనా అధికారి పి.సాహితి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కీమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాలకుగాను ఇంటర్వ్యూలు నిర్వహించనుందని, ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత, ఆసక్తి గల ఉమ్మడి వరంగల్ నిరుద్యోగ యువతీయువకులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో నిర్వహించే జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు జె.గీత , సీనియర్ అసిస్టెంట్ ఫోన్ నంబర్ 7995430401లో సంప్రదించాలని సూచించారు.

కృత్రిమమేధ.. కీలకపాత్ర

- కేయూ పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్

విద్యారణ్యపురి : వ్యవసాయం, ఫార్మా, వ్యాపార, వాణిజ్య తదితర రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) కీలకపాత్ర పోషిస్తోందని కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె.రాజేందర్ తెలిపారు. బుధవారం హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీఅండ్ పీజీ కళాశాలలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రీ షేపింగ్ ది లాండ్‌స్కేప్ ఆఫ్ కామర్స్అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో రాజేందర్ పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సులో హైదరాబాద్ ఎంజెల్స్ సీఈఓ, ఇన్వెస్ట్‌మెంట్ డైరెక్టర్ రత్నాకర్ సామవేదం కీలక ఉపన్యాసం చేశారు. అనంతరం అతిథులు సావనీర్‌ను ఆవిష్కరించారు. పలువురు పరిశోధన పత్రాలు సమర్పించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, సదస్సు కన్వీనర్ డాక్టర్ రాజిరెడ్డి, కేయూ ప్రొఫెసర్ పి.అమరవేణి, కామర్స్ విభాగం అధిపతి డాక్టర్ సారంగపాణి, హుస్నాబాద్ కాలేజీ ప్రిన్సిపాల్ భిక్షపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

పూర్వ విద్యార్థులు సహకారం అందించాలి

- కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో చదువుకొని వివిధ దేశాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థుల కృషిని అభినందిస్తూ, వర్సిటీ అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు సహకారం అందించాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి కోరారు. అమెరికాలోని అట్లాంటాలో ఫార్మసీ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించగా బుధవారం వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సెలబ్రేట్ అండ్ కంట్రిబ్యూట్ అనే థీమ్‌తో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ఫార్మా రంగంలో ఎంతోమంది ఉన్నత స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల సమూహాలు యూనివర్సిటీ గ్లోబల్ భాగస్వామ్యానికి రావాలని కోరారు. అల్యూమ్ని గోల్డెన్‌జూబ్లీ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అమెరికా సంయుక్తరాష్ట్రాల విశ్వవిద్యాలయ ఫార్మసీ చాప్టర్, కేయూ ఫార్మసీ విభాగం పూర్వవిద్యార్థి డాక్టర్ సాంబారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ పరుచూరితో పాటుగా పూర్వవిద్యార్థులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



అట్లాంటాలో నిర్వహించిన కేయూ ఫార్మసీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో పూర్వవిద్యార్థులతో వీసీ

భూసమస్యలను వేగంగా పరిష్కరించాలి

- వీసీలో రాష్ట్ర రెవెన్యూ సెక్రటరీ లోకేశ్ కుమార్

జనగామ రూరల్: భూసమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ సెక్రటరీ లోకేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ సెక్రెటరీ సాదాబైనామా పరిష్కారం, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..సాదాబైనామాకు సంబంధించి భూములు కొన్నవారికి, అమ్మినవారికి నోటీసులు ఇచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సాదాబైనామా రెగ్యులరైజ్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..సాదాబైనామాలలో 33 వేల దరఖాస్తులు రాబోయే రోజుల్లో పూర్తి చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామని తదనుగుణంగా అధికా రులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి సుహాసిని, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓలు గోపిరామ్, డీఎస్.వెంకన్న, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ మన్నెంకొండ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, జిల్లా అధికారులు

స్వచ్ఛతా హీ సేవా షురూ..

జనగామ: దేశవ్యాప్తంగా పరిశుభ్రతపై ప్రజలను చైతన్యపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం బుధవారం నుంచి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు తలపెట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని బుధవారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఆర్డీవో గోపీరామ్, డీఆర్డీవో పీడీ వసంత, జెడ్పీసీఈఓ మాధురీ షా, డిప్యూటీ సీఈఓ సరితతో కలిసి విప్ సెల్ఫీ ఫొటోతో విప్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్, డీఈ లక్ష్మినారాయణరెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పురపాలిక ఆధ్వర్యంలో..

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం పురస్కరించుకుని జనగామ పురపాలిక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉద్యోగులు, సిబ్బంది, శానిటేషన్ కార్మికుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో స్వచ్ఛత నెలకొలిపేందుకు అంకిత భావంతో పని చేస్తామని ఉద్యోగులు, పురపాలిక చేసే కార్యక్రమంలో భాగస్వామ్యులుగా ఉంటామని ప్రజలు ప్రతిజ్ఞ చేశారు.



జనగామలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

ఉపాధ్యాయుడిని తిరిగి రప్పించండి

- పాఠశాల ఎదుట గ్రామస్తుల ధర్నా

బచ్చన్నపేట: మండలంలోని చిన్నరామన్‌చర్లలో పనిచేసి డిప్యుటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డిని తిరిగి వెనక్కి రప్పించాలంటూ బుధవారం పాఠశాల ఎదుట గ్రామస్తులు, విద్యార్థులు ధర్నా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచడంతో పాటు అభివృద్ధికి శ్రీనివాస్‌రెడ్డి బాటలు వేశారని, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని తిరిగి రప్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పలు సంఘాల నాయకులు, తల్లిదండ్రులు గంధమల మనోహర్, బుర్రి సుధాకర్, ఆజం తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపిక

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి(జి), తిడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు గాదె శ్రీజ, చెన్నూరి అంజలి రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సీతారామయ్య, దామెరకొండ సదానందం, పాఠశాలల పీఈటీలు శిరంశెట్టి శ్రీధర్, గోపు నరేశ్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ఈ నెల 22, 23, 24 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

పాలకుర్తి పాఠశాల విద్యార్థి..

పాలకుర్తి టౌన్: రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎల్లబోయిన చరణ్ ఎంపికై నట్లు బుధవారం ప్రధానోపాధ్యాయురాలు పాయం శోభారాణి, ఫిజికల్ డైరెక్టర్ మామిండ్ల సోమ్మల్లు తెలిపారు.





గాదె శ్రీజతో ప్రధానోపాధ్యాయులు, పీఈటీ. చరణ్‌ను అభినందిస్తున్న హెచ్ఎం శోభారాణి

మహిళలకు ఆరోగ్య భద్రత

- ఎంసీహెచ్‌లో స్వస్థనారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌ను ప్రారంభించిన విప్ అయిలయ్య
- అక్టోబర్ 2వరకు ప్రతీ వైద్యకేంద్రంలోనూ నిరంతర సేవలు: ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్

జనగామ: కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న మహిళల ఆరోగ్య భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించిందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విప్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రాం ఆవిష్కరించారు. అంతకుముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో కలిసి విప్ ప్రసంగించారు. దేశవ్యాప్తంగా మహిళల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ ఈ సేవలను అందుబాటులోకి తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పుట్టబోయే శిశువుల సంపూర్ణ ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని, కాబోయే తల్లులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా శిశు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమానికి యాక్షన్ ప్లాన్ తయారు చేసి, సేవలు ప్రారంభించాయన్నారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్ మాట్లాడుతూ.. మహిళలు తమ ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేస్తున్నారనే భావనతో ప్రభుత్వం బుధవారం నుంచి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు 15 రోజులు పాటు ప్రతి వైద్యకేంద్రంలోనూ నిరంతరం సేవలందించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రతిరోజు వైద్య నిపుణుల పర్యవేక్షణలో సేవలు కొనసాగుతాయన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులు ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిచ్చేందుకు తీసుకోవలసిన పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ, పౌష్టికాహారానికి సంబంధించి స్టాల్స్ ప్రదర్శించారు. ఐదు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో మాధురి షా, ఆర్డీవో గోపిరామ్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఫ్లోరెన్స్, ప్రొఫెసర్, డాక్టర్ గోపాల్‌రావు, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ఎంసీహెచ్‌పీఓ డాక్టర్ అశోక్ కుమార్, ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, ఆర్టీఏ మెంబర్ అభిగౌడ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధీర్, డాక్టర్లు స్వర్ణకుమారి, అజయ్, కమల్, గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.



పౌష్టికాహార స్టాల్స్‌లో పోస్టర్ ప్రదర్శిస్తున్న విప్, ఇన్‌చార్జి కలెక్టర్, రెవెన్యూ అదనపు కలెక్టర్, డీసీపీ

గత ప్రభుత్వ స్టిక్కర్‌పై ఆగ్రహం

జనగామ: జనగామ ఎంసీహెచ్‌లో స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రాం ప్రారంభోత్సవంలో బుధవారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య గత ప్రభుత్వం సర్జికల్ ప్యాకెట్‌పై ముద్రించిన స్టిక్కర్‌ను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేసేందుకు ఏర్పాటు చేసిన చాంబర్‌ను పరిశీలించే క్రమంలో నాటి సర్కారు పేరిట ఉన్న స్టిక్కర్‌ను విప్ గమనించారు. ఇదేంటని ఆగ్రహం వ్యక్తం చేయడంతో..అక్కడే ఉన్న వైద్య సిబ్బంది వెంటనే దానిని తొలగించారు. మెడికల్ ప్యాకెట్లపై గత ప్రభుత్వ స్టిక్కర్లు ఉన్నా..ఎందుకు పరిశీలించలేదని, మొదటి తప్పుగా వదిలేస్తున్నామన్నారు. మరోసారి రిపీట్ కావద్దన్నారు.



స్టిక్కర్‌ను తొలగిస్తున్న వైద్య సిబ్బంది

క్లుప్తంగా

తల్లిపాలు అందించిన లిఖిత


తల్లిపాలను అందజేస్తున్న లిఖిత

నర్సంపేట: చెన్నారావుపేట మండలం లింగాపురం గ్రామానికి చెందిన పల్నాటి కరుణాకర్ సతీమణి లిఖిత ఆదర్శంగా నిలిచింది. తన మూడు నెలల పాప వేదస్యకు తల్లిపాలు సరిపడా అందించిన అనంతరం మిగిలిన ఏడు లీటర్ల పాలను నిల్వ చేసి బుధవారం హనుమకొండలోని ప్రభుత్వ మాతాశిశు సంరక్షణ కేంద్రానికి అందించింది. ఇంతకు ముందు ఆగస్టు 29న నాలుగు లీటర్ల తల్లిపాలు అందించింది. ఇలా దానం చేయడం ద్వారా పలు కారణాల వల్ల తల్లిపాలు అందని శిశువులకు అవసరమైన పోషణ అందించగలుగుతారని లిఖిత తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతీ తల్లి, శిశువు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు ప్రేరణగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు.

బకెట్ నుంచి వాటర్ హీటర్ తీస్తుండగా..

- విద్యుదాఘాతంతో మహిళ మృతి
- బొంతగట్టునాగారంలో ఘటన


లింగమ్మ (ఫైల్)

తరిగొప్పుల: స్నానానికి వేడి నీళ్ల కోసం బకెట్‌లో పెట్టిన వాటర్ హీటర్ తీస్తుండగా షాక్ తగిలి ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన బుధవారం మండలంలోని బొంతగట్టునాగారంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీదేవి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పిల్లి లింగమ్మ(48) బాత్‌రూంలో స్నానానికి వేడి నీళ్ల కోసం బకెట్‌లో వాటర్ హీటర్ పెట్టింది. అనంతరం స్విచ్ ఆఫ్ చేసి బకెట్‌లోని వాటర్ హీటర్ తీస్తుండగా విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో షాక్ తగిలి మృతి చెందింది. మృతురాలి భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటర్ వర్సిటీ పోటీలకు ఆర్చరీ జట్ల ఎంపిక


ఆర్చరీ ఎంపికకు హాజరైన క్రీడాకారులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్‌బోర్డు ఆధ్వర్యంలో బుధవారం ఆర్చరీ పురుషుల, మహిళల జట్ల ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ఆర్చరీ క్రీడాకారులు తన్వీర్‌కొసర్, త్రిశూల్,అశ్విత్, రమ్య, మనసుర హాసిభ, వెంకటేష్, ఆనంద్, గంగరాజు పాల్గొన్నారు. ఈ జట్లు ఈఏడాది అక్టోబర్‌లో పంజాబ్‌లోని గురుకాశీ యూనివర్సిటీ, పఠాన్‌లోని హెచ్ఎన్ యూనివర్సిటీలో నిర్వహించనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య తెలిపారు. డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్, డాక్టర్ కుమారస్వామి, రాజేశ్, ఆంజేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం

- జిల్లా కేంద్రం శివారులో ఘటన

ములుగు: జిల్లా కేంద్రం శివారులోని వివేకవర్ధిని పాఠశాల సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుగులోత్ శ్రీను (35) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ప్రేమ్‌నగర్‌కు చెందిన శ్రీను ద్విచక్ర వాహనంపై గట్టమ్మ నుంచి తన ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ములుగు నుంచి హనుమకొండ వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో శ్రీను అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అప్రమత్తతే ఆయుధం..

- మిరప పంటను ఆశిస్తున్న చీడపీడలు
- సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- జెమిని వైరస్, బొబ్బ రోగంపై జాగ్రత్తగా ఉండాలి
- రైతులకు మల్యాల కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ దిలీప్ కుమార్, శాస్త్రవేత్తలు సుహాసిని, క్రాంతికుమార్ సలహాలు


పైముడత సోకిన మిరప మొక్క


కింది ముడత సోకిన మొక్క


లద్దె పురుగు సోకిన మొక్క



మొక్కకు సోకిన జెమిని వైరస్

మహబూబాబాద్ రూరల్ : జెమిని వైరస్, బొబ్బ రోగం.. ప్రస్తుతం మిరప రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. పంటను నాటి నెలరోజులు గడవక ముందే చిన్న మొక్కలపై రైతులు పోటాపోటీగా పురుగుల మందులు, సిఫార్సు లేని బయో మందులను పిచికారీ చేస్తున్నారు. ఫలితంగా పెట్టుబడి పెరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆగస్టులో పొడి వాతావరణం పరిస్థితులలో వేసిన మిరప పంటను ప్రస్తుతం వివిధ చీడ పీడలు ఆశిస్తున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మిరప పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని మహబూబాబాద్ మండలం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త దిలీప్ కుమార్, శాస్త్రవేత్తలు సుహాసిని, క్రాంతికుమార్.. రైతులకు సలహాలు, సూచనలు చేశారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

పైముడత నివారణకు :
ఫిప్రోనిల్ ఎస్.సి 2 మిల్లీలీటర్లను లీటర్ నీటిలో లేదా డైఫెన్ థయురాన్ 1.5గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కింది ముడత నివారణకు ..
నీటిలో కరిగే గంధకం 3 గ్రాములను లీటర్ నీటిలో లేదా స్పైరోమెసిఫెన్ 0.8 మిల్లీ లీటర్లను లీటర్ నీటికి లేదా ప్రాపర్ గైట్ 57శాతం 2 మిల్లీ లీటర్లను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

జెమిని మొజాయిక్ వైరస్ (గుబ్బ) నివారణకు..



- ఇది తెల్లదోమ ద్వారా వ్యాపిస్తుంది. వైరస్ నివారణకు ప్రత్యేకంగా ఎలాంటి మందులు లేవు. అందుకే సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలి.
- తొలిదశలోనే వైరస్ సోకిన మొక్కలను ఎప్పటికప్పుడు పీకి కాల్చి వేయాలి. ప్రధాన పొలంలో, గట్లపై కలుపు మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త తీసుకోవాలి. కొన్ని రకాల కలుపు మొక్కలు వైరస్ తెగుళ్లకు ఆశ్రయం కల్పిస్తాయి. మిరప తోటలో వంగ (బెండ), టమాట మొక్కలను ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచొద్దు. ఇవి తెల్ల దోమలకు ఆశ్రయం కల్పిస్తాయి.

లద్దె పురుగు నివారణకు ..
నోవాల్యూరాన్ 0.75 మిల్లీ లీటర్లను లీటర్ నీటిలో లేదా స్పైనోసాడ్ 0.25 మిల్లీ లీటర్లను లీటర్ నీటిలో లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములను లీటర్ నీటిలో లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మిల్లీ లీటర్లను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. సిఫార్సు లేని బయో మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడొద్దు.

- పొలం చుట్టూ 2 నుంచి 3 వరుసల సజ్జ, జొన్న లేదా మొక్కజొన్న రక్షణ పంటలుగా వేసుకోవాలి. పసుపు, నీలం రంగు జిగురు అట్టలను 20 నుంచి 25 చొప్పున ఎకరానికి రైతులు సామూహికంగా వేసుకోవాలి. మొక్కల ఎత్తును బట్టి జిగురు అట్టలను కూడా పైకి అమర్చుకోవాలి. తెల్ల దోమల నివారణకు 5శాతం వేప గింజల కషాయం (వేప నూనె 1500 పీపీఎం) 5 మిల్లీ లీటర్లను లీటర్ నీటిలో లేదా పైరిప్రాక్సిఫెన్ 102 ఇ.సి. 1.5 మిల్లీ లీటర్లను లీటర్ నీటిలో లేదా ఫెరిప్రాక్సిఫెన్ 57. ఇ.సి. + ఫెన్ పోపాత్రిన్ 15 ఇ.సి. 1 మిల్లీ లీటర్‌ను లీటర్ నీటిలో లేదా ఫెనో పాత్రిన్ 30శాతం ఇ.సి 0.5 మిల్లీ లీటర్లను లీటర్ నీటిలో లేదా థయామిథాక్సాం 0.4 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ప్రతీ సారి రైతులు పురుగుమందును పిచికారీ చేసినప్పుడు కేవలం పురుగు మందును మాత్రమే కాకుండా పోషకాల మిశ్రమం (191919/13045) లేదా సూక్ష్మ పోషకాల మిశ్రమం 5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే మొక్కలకు బలాన్ని ఇస్తూ, వ్యాధి నిరోధక శక్తి పెరిగి కొత్తరకాల చీడ, పీడలను తట్టుకొని నిలబడే అవకాశం ఉంటుంది.

నిజాంను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టులది


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నెహ్రూసెంటర్: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం నిజాం సర్కార్‌ను తరిమికొట్టి తెలంగాణను విముక్తి చేసి, దున్నేవాడికే భూమి అంటూ 10 లక్షల ఎకరాల భూములను పంపిణీ చేసిన చరిత్ర కమ్యూనిస్టులదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు వేల మంది అమరత్వం, హింస, దోపిడీకి వ్యతిరేకంగా సాయుధ పోరాటం సాగిందని, రైతాంగ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనన్నారు. కమ్యూనిస్టుల పోరాట చరిత్రను కనుమరుగు చేసేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ యత్నిస్తున్నాయని మండిపడ్డారు. నాటి నిజాం ప్రభుత్వానికి నేటి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తేడా ఏమి లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రభుత్వ, బంచరాయి భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో శెట్టి వెంకన్న, సూర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, ఆకుల రాజు, కందునూరి శ్రీనివాస్, కుంట ఉపేందర్, అల్వాల వీరయ్య, బానోత్ సీతారాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఎన్ఐ వర్క్స్..

- పలు రైళ్లు రద్దు..హాల్టింగ్ ఎత్తివేత
- ఈ నెల 18, 19 తేదీల్లో అమలు

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని కాజీపేట, బల్లార్షా మధ్య ఆటోమెటిక్ బ్లాక్ సిగ్నలింగ్ రైల్వే ఎన్ఐ వర్క్స్‌తో పలు రైళ్లను రద్దు చేయడంతోపాటు పలు రైళ్లకు వివిధ స్టేషన్లలో హాల్టింగ్ ఎత్తివేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం తెలిపారు.

రద్దయిన రైళ్లు
ఈ నెల 19వ తేదీన కాజీపేట–సిర్పూర్‌టౌన్ (17003) ప్యాసింజర్, బల్లార్షా–కాజీపేట (17004) రామగిరి ప్యాసింజర్ , ఈ నెల 18వ తేదీన(నేడు) కాజీపేట–బల్లార్షా (17035) రామగిరి ప్యాసింజర్, బల్లార్షా–కాజీపేట (17036) ప్యాసింజర్, సిర్పూర్ టౌన్–కరీంనగర్ (87771) పుష్‌పుల్, కరీంనగర్–సిర్పూర్‌టౌన్ (67772) పుష్‌పుల్ రద్దయ్యాయి.

పాక్షికంగా రద్దయిన రైళ్లు
ఈ నెల 19వ తేదీన భద్రాచలంరోడ్–బల్లార్షా (17033) సింగరేణి కాజీపేట–బల్లార్షా మధ్య, సిర్పూర్‌టౌన్–భద్రాచలంరోడ్ (17034) సింగరేణి సిర్పూర్ టౌన్–కాజీపేట మధ్య, సిర్పూర్‌కాగజ్‌నగర్–సికింద్రాబాద్ (17234) ఎక్స్‌ప్రెస్ సిర్పూర్‌కాగజ్‌నగర్–కాజీపేట మధ్య, ఈ నెల 18న సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (17233) ఎక్స్‌ప్రెస్ కాజీపేట–సిర్పూర్‌కాగజ్‌నగర్ మధ్య రద్దు.

తాత్కాలికంగా హాల్టింగ్ ఎత్తివేత..
ఈ నెల 19వ తేదీన హైదరాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (17011) ఎక్స్‌ప్రెస్‌కు, సిర్పూర్‌కాగజ్‌నగర్–బీదర్ (17012) ఎక్స్‌ప్రెస్‌కు మందమర్రి రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఎత్తివేశారు.

రెగ్యులేషన్ ట్రైన్..
ఈ నెల 19వ తేదీన డెహ్రాడూన్–చర్లపల్లి (07078) ఎక్స్‌ప్రెస్ 30 నిమిషాల పాటు రెగ్యులేటెడ్ చేశారు.

కేటీఆర్.. నర్సింహమూర్తిని బహిష్కరిస్తావా?

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ప్రశ్న


నర్సింహమూర్తి మాట్లాడిన వీడియోను విలేకరులకు చూపుతున్న మంత్రి సీతక్క

ములుగు: ములుగు జిల్లాలో బాండ్ మొక్కజొన్న నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను వచ్చి విచారిస్తావా.. బీఆర్ఎస్‌కు చెందిన దశరి నర్సింహమూర్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తావా కేటీఆర్ అంటూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ప్రశ్నించారు. బుధవారం ములుగు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి సీతక్క విలేకరులతో మాట్లాడారు. బాండ్ మొక్కజొన్న నకిలీ విత్తనాలను రైతులకు అందించిన ప్రైవేట్ కంపెనీలో దళారీగా ఉన్న బీఆర్ఎస్‌కు చెందిన నర్సింహమూర్తి.. కేటీఆర్ సమక్షంలో మాట్లాడుతూ 'నా యావదాస్తిని పార్టీకి రాసిస్తా కానీ బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే కలెక్టర్‌ను వదిలిపెట్టవద్దు' అని మాట్లాడితే కేటీఆర్ నవ్వి ఊరుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నా రు. మొక్కజొన్న విత్తనాలతో వెంకటాపురం(కె), వాజేడు, కన్నాయిగూడెం మండలాల్లో 1,521 ఎకరాల్లో పంట నష్టపోయిన 671 మంది రైతులకు కలెక్టర్ దివాకర టీఎస్ ప్రైవేట్ కంపెనీల నుంచి రూ.3. 80 కోట్లు పరిహారాన్ని ఇప్పించారని చెప్పారు. కలెక్టర్ కార్యకర్తగా పనిచేశాడని ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర చరిత్రలోనే ప్రైవేట్ కంపెనీల నుంచి రైతులకు పరిహారం ఇప్పించిన ఘన త ప్రభుత్వానిదేనని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు సేవచేసే అధికారులను టార్గెట్ చేయడమే బీఆర్ఎస్ లక్ష్యమా అని విమర్శించారు. రైతులపై కేటీఆర్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా నర్సింహమూర్తిని పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులపక్షాన పనిచేస్తున్న కలెక్టర్‌ను ప్రశంసించాలే తప్ప విమర్శించకూడదని ఆమె హితవుపలికారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి భగవాన్ రెడ్డి, ఇరుసవడ్ల వెంకన్న పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్

- సాయుధ పోరాటంతో పేదలకు 10 లక్షల ఎకరాల భూమి పంపిణీ
- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ


మాట్లాడుతున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

జనగామ రూరల్: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరుల త్యాగాలు వెలకట్టలేనివని, చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను నిలదీయాలని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షతన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం పట్టణంలో రైల్వే స్టేషన్ నుంచి ప్రెస్టెన్ మైదానం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎంఏ బేబీ మాట్లాడుతూ తెలంగాణలో 1946 – 51 వరకు నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో మూడు వేల గ్రామాలు పాల్గొన్నాయన్నారు. ఈ సందర్భంగా పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారన్నారు. ఈ పోరాటంలో నాలుగు వేల మంది కార్యకర్తలు చనిపోయారని, ఈపోరాట ఫలితంగా తెలంగాణలో భూసంస్కరణల చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. 1957లో కేరళలో భూసంస్కరణ చట్టం కోసం ఉద్యమం ముందుకు వచ్చిందన్నారు. చరిత్రలో పారిస్ కమ్యూన్ కంటే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం గొప్పదన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ తెలంగాణలో విమోచన పేరుతో చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. గాడ్సే 6నెలలకు ముందే సావర్కర్ వద్ద ఆశీర్వాదం పొంది గాంధీజీని హత్య చేశారని, దీనిని కూడా వక్రీకరించిందని, చరిత్ర ఎరిగిన సాక్ష్యమని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మహ్మద్ అబ్బాస్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని హిందూ, ముస్లింల పోరాటంగా వక్రీకరిస్తున్నారని, దీనిని కమ్యూనిస్టు కార్యకర్తలు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి విట్టల్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, బూడిది గోపి, ఇర్రి అహల్య, సాంబరాజు యాదగిరి, సింగారపు రమేష్, రాపర్తి సోమన్న, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు జోగు ప్రకాశ్, సుంచు విజేందర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దసరా ఉత్సవాలు నిర్వహిస్తాం

బతుకమ్మ, విజయదశమికి ఏర్పాట్లు చేయండి

- రంగలీల మైదానం అభివృద్ధికి చర్యలు
- అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



ఉర్సు రంగలీల మైదానాన్ని పరిశీలిస్తున్న మంత్రి సురేఖ, పక్కన కలెక్టర్ సత్యశారద, సీపీ సన్‌ప్రీత్ సింగ్

ఖిలా వరంగల్: సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సావాలను వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. కరీమాబాద్‌లోని ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధ్యక్షతన సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్లపై నగర మేయర్ గుండు సుధారాణి, నగర పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి మంత్రి సురేఖ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. బతుకమ్మ ఆట స్థలాలను శుభ్రం చేయాలని బల్దియా అధికారులను ఆదేశించారు. దసరా కమిటీ విజ్ఞప్తి మేరకు రంగలీల మైదానంలో మైసూరును తలపించేలా దసరాకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధాన రహదారుల్లోని గుంతలను పూడ్చివేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఉర్సుతోపాటు కాశిబుగ్గ, రంగశాయిపేట, శివనగర్‌లో మహిళా సంఘాలతో ఫుడ్‌స్టాళ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు, రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఒక జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు, ఈనెల 21న వేయి స్తంభాల దేవాలయంలో నిర్వహించనున్న వేడుకలు ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడారు. సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. సమావేశంలో డీసీపీ సలీమా, డీఆర్‌ఓ విజయలక్ష్మి, ట్రాఫిక్ డీసీపీ ప్రభాకర్‌రావు, ఏఎస్పీ శుభం ప్రకాశ్, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్లు ఇక్బాల్, శ్రీకాంత్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, సత్యనారాయణ, దసరా ఉత్సవ కమిటీ బాధ్యులు నాగపూరి సంజయ్‌బాబు గౌడ్, మేడిది మధుసూదన్, మండ వెంకటన్న, గోనె రాంప్రసాద్, గోపాల నవీన్ రాజు, మీసాల ప్రకాశ్ పాల్గొన్నారు.

డీసీసీబీలో 'ప్రజాపాలన'


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని బుధవారం ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఈఓ వజీర్ సుల్తాన్, జీఎంలు ఉషాశ్రీ, పద్మావతి, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, గొట్టం స్రవంతి, గంప స్రవంతి, రాజు, కృష్ణ మొహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రగతే లక్ష్యంగా ముందుకెళ్తున్న రాష్ట్రం

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి


మాట్లాడుతున్న సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి


హన్మకొండ: ఆర్థిక ప్రగతి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రం ముందుకెళ్తోందని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అమరవీరుల స్తూపం వద్ద పూలమాల ఉంచి అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవం కోసం జరిపిన పోరాట ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న ప్రత్యేక సంస్థానంగా ఉన్న తెలంగాణ ప్రాంతం భారత్‌లో విలీనమైందన్నారు. ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకున్నారన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్‌ను సాంకేతికంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. డైరెక్టర్లు వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బోనాల కిషన్, చీఫ్ ఇంజనీర్లు టి.సదర్‌లాల్, రాజు చౌహాన్, అశోక్, కె.మాధవరావు, చీఫ్ జనరల్ మేనేజర్లు రవీంద్రనాథ్, ఆర్.చరణ్ దాస్, జనరల్ మేనేజర్లు వెంకటకృష్ణ, మల్లికార్జున్,నాగప్రసాద్, వేణుబాబు, అన్నపూర్ణ, శ్రీకాంత్, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

ట్రాన్స్‌ఫార్మర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈలు, వివిధ విభాగాల డీఈలు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లపై ఉన్న సర్వీస్‌లను మ్యాపింగ్ చేయాలన్నారు. ఇంటి లోపల ఉన్న మీటర్లు బయట అమర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్కిల్ పరిధిలో విధిగా పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, సీఈలు టి.సదర్ లాల్, కె.తిరుమల్ రావు, రాజుచౌహాన్, సి.జి.ఎంఆర్. చరణ్ దాస్, జీఎంలు వెంకటకృష్ణ, అన్నపూర్ణ, నాగప్రసాద్, వేణుబాబు, కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

మంత్రాల నెపంతోనే వృద్ధురాలి హత్య

- నిందితులు మృతురాలి బంధువులే..
- రాధమ్మ హత్య ఘటనలో ముగ్గురి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కృష్ణకిశోర్


నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ కృష్ణకిశోర్

నెల్లికుదురు : ఓ వృద్ధురాలిని హత్య చేసి బావిలో పడేసిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం నెల్లికుదురు పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రానికి చెందిన వీరగాని రాధమ్మ (80) ఒంటరిగా నివసిస్తోంది. కాగా, మండల కేంద్రానికి చెందిన నిందితులు వీరగాని ఉప్పలయ్య, అతడి తమ్ముడు మహేశ్‌కు రాధమ్మ వరుసకు పెద్దమ్మ అవుతుంది. ఈ క్రమంలో ఉప్పలయ్య తన ఆరోగ్యం బాగలేకపోవడానికి కారణం రాధమ్మ మంత్రాలు చేయడమేనని ఆమెపై కక్ష పెంచుకున్నాడు. దీంతో ఎలాగైనా ఆమెను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయం తన తమ్ముడు మహేశ్‌కు చెప్పగా అతడు ఒప్పుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీన రాత్రి 11గంటల సమయంలో ఇద్దరు కలిసి రాధమ్మ ఇంటికెళ్లారు. ఆమెను బయటకు పిలిచి తమ వెంట తెచ్చుకుని ఇనుపరాడ్‌తో తలపై బలంగా కొట్టారు. దీంతో రాధమ్మ కిందపడగా పక్కనే ఉన్న చేదబావిలో పడేశారు. మృతి చెందిందని నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం మహేశ్ ఈ విషయం తన స్నేహితుడు, అదే గ్రామానికి చెందిన దువ్వాడ రాజుకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో రాజు బైక్ తీసుకుని రాగా ముగ్గురు కలిసి మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి బ్రిడ్జివద్దకు వెళ్లి రాధమ్మ హత్యకు ఉపయోగించిన రాడ్‌ను వాగులో పడేశారు. వాగులోనే రక్తపు మరకలు అంటుకున్న తమ దుస్తులను శుభ్రం చేసుకున్నారు. అనంతరం ముగ్గురు కలిసి రంగనాయకమ్మ గుడి దగ్గర ఉన్న బెల్టుషాపులో మద్యం తాగారు. ఈ ఘటనపై మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఐదు రోజుల్లోనే నిందితులు ఉప్పలయ్య, మహేశ్, రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

గ్రామీణ పరిస్థితులపై సమగ్ర అధ్యయనం


తిమ్మాపురంలో ఎస్ఆర్ వ్యవసాయ కళాశాల డీన్ భూపాల్‌రాజు, అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, విద్యార్థులు

మామునూరు: గ్రామీణ పరిస్థితులపై సమగ్రంగా అధ్యయనం చేయాలని వ్యవసాయ కళాశాల డీన్ భూపాల్‌రాజు సూచించారు. ఈ మేరకు ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం రాంగోపాలపురంలో ఎస్ఆర్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గ్రామీణ పరిస్థితుల అధ్యయన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వనరులు, పటం, గ్రామ భౌగోళిక పరిస్థితులు, వ్యవసాయ స్థితిగతులు, సామాజిక అంశాలు, పశు సంవర్ధక రంగం, గ్రామ సమస్యలు వంటి అనేక అంశాలను విద్యార్థులు సమగ్రంగా సేకరించి చిత్రపటాల రూపంలో ప్రదర్శించాలన్నారు. ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రీకర్‌రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, డాక్టర్ శ్రవణ్‌కుమార్, కేటీ విజయ్, ఇన్‌స్పెక్టర్లు కార్తీక్, వెంకటేశ్వర్లు, ఫార్మసీ అధికారులు జలగం రమేశ్‌కుమార్, బి.సురేశ్, డాక్టర్ మధు, శ్రావ్య, రవితేజ, ఏఈఓ సత్యప్రకాశ్, జలగం రమేశ్, సొసైటీ డైరెక్టర్లు చెన్నారెడ్డి, సాయి నందన్‌రెడ్డి, రాజేశ్వర్ రావు, ప్రసాద్‌రావు, రాములు పాల్గొన్నారు.